# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ గురువారం 27 నవంబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయాలు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రేర్ ఎర్త్ మ్యాగ్నెట్ ప్రొడక్షన్ (ఆర్ఈఎంఫఈ)కు రూ.7,280 కోట్లు కేటాయిస్తూ కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. బుధవారం నాడిక్కడ ప్రధాని మోడీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గం సమావేశమైంది. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మంత్రివర్గ నిర్ణయాలను వెల్లడించారు. పుణే నగరంలో మెట్రో రైలు (రెండో దశ) పొడిగింపునకు రూ.9,858 కోట్లు కేటాయించినట్లు వివరించారు. మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల్లో దేవభూమి ద్వారక - కర్నాలస్ రైల్వే లైన్ డబ్లింగ్ పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. అందుకు రూ.1,457 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. బద్లాపూర్ - కర్జాత్ థర్డ్, ఫోర్త్ రైల్వే పనులకు సైతం అనుమతి ఇచ్చినట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టులన్నీ సకాలంలో పూర్తవుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. ముంబాయి సమీపంలోని బద్లాపూర్ - కర్జాత్ లైన్, గుజరాత్‌లోని ద్వారకా లైన్‌లకు ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టులు ద్వారా లక్షలాది మంది ప్రయాణికులకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరుతుందన్నారు. అలాగే ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుందని చెప్పారు. పుణే మెట్రోకు కేంద్రం రూ. 9,858 కోట్లు గ్రాంట్‌ను అందించనుందన్నారు. దీనిద్వారా 32 కిలోమీటర్ల మేర కొత్త లైన్

మిగితా 2వ పేజీలో

## రాజ్యాంగమే ప్రజాస్వామ్యానికి బలపునాది

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- సంవిధాన్ సదన్‌లో ఘనంగా 75వ రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమం



**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు రాజ్యాంగమే మూలస్థంభమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. బుధవారం న్యూఢిల్లీ సంవిధాన్ సదన్ సెంట్రల్ హాల్‌లో నిర్వహించిన 75వ భారత రాజ్యాంగ దినోత్సవ సభలో ఆమె ప్రసంగించారు. కార్యక్రమానికి ఉప రాష్ట్రపతి సీపీ రాధాక్రిష్ణన్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తదితరులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా రాష్ట్రపతి అందరితో కలిసి భారత రాజ్యాంగ ప్రవేశికను పఠింపజేశారు. అలాగే తెలుగు సహా పది భారతీయ భాషల్లో ప్రచురించిన డిజిటల్ రాజ్యాంగ ప్రతులు మరియు స్మారక బుక్‌లెట్లు విడుదల చేశారు. రాజ్యాంగం ప్రజల స్వాభిమానాన్ని కాపాడే ఎన్నో హక్కులను కల్పిస్తోందని రాష్ట్రపతి ముర్ము పేర్కొన్నారు. రాజ్యాంగం శాశ్వతమైన కర్తవ్యబోధ, నైతికతకు మార్గదర్శి అని ఆమె స్పష్టం చేశారు. సామాజిక న్యాయానికి రాజ్యాంగంలో ప్రాధాన్యత కల్పించడంతో %జుబౌ% రిజర్వేషన్లు అమల్లోకి వచ్చాయని తెలిపారు. భారత్ త్వరలోనే ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగనుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

దేశవ్యాప్తంగా ఆర్థిక సమీకరణ కోసం జీఎస్టీ వ్యవస్థ కీలకపాత్ర పోషించిందని చెప్పారు. వలసవాద ఆలోచనల నుండి దేశాన్ని దూరం చేసిన గ్రంథం రాష్ట్రపతి ముర్ము మాట్లాడుతూ, రాజ్యాంగం వలసవాద మనస్తత్వాన్ని విడనాడి జాతీయతావాద దిశగా దేశాన్ని నడిపించే గొప్ప పాఠ గ్రంథమని తెలిపారు. మహిళలు, యువత, ఎస్సీలు, ఎస్టీలు, రైతులు, మధ్యతరగతిఈ వర్గాలే ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తున్నారని అన్నారు.

25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తేవడం దేశ చరిత్రలో కీలక విజయం అని అభినందించారు. 1949 నవంబర్ 26 ౧ ఇదే రోజున రాజ్యాంగ ఆమోదం "1949 నవంబర్ 26న, ఇదే సెంట్రల్ హాల్‌లో మన రాజ్యాంగం ఆమోదముద్ర పొందింది. డా. బీఆర్‌అంబేద్కర్ రాజ్యాంగ ముసాయిదా కమిటీ చైర్మన్‌గా పనిచేసి ప్రజాస్వామ్య భారతానికి పునాది వేశారు" అని రాష్ట్రపతి గుర్తుచేశారు. 'భారత్ ఎప్పటికీ ఒక్కటే' అని రాజ్యాంగం చెబుతోంది: ఉప రాష్ట్రపతి

ఉప రాష్ట్రపతి సీపీ రాధాక్రిష్ణన్ మాట్లాడుతూ: రాజ్యాంగ ప్రవేశిక మన జాతీయ ఏకత్వానికి ప్రతీక అన్నారు. "భారత్ ఒకటే, ఎప్పటికీ ఒకటిగానే ఉంటుంది" అనే సందేశాన్ని ప్రవేశిక స్పష్టం చేస్తుందని తెలియజేశారు. ప్రజా ప్రతినిధులు ప్రజల కోరికలను నెరవేర్చేందుకు శాసనసభల్లో చర్చలు జరపాలని సూచించారు. జీఎస్టీ వన్ నేషన్ వన్ ట్యాక్స్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చిందని అన్నారు. రాజ్యాంగం మార్గం అనుసరిస్తే 2047కి వికసిత భారత్: లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా మాట్లాడుతూ: రాజ్యాంగం లక్ష్యాలు, విలువలను పాటిస్తేనే 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ నిలుస్తుందని తెలిపారు. అభివృద్ధి, న్యాయం, ఐక్యత, మానవత్వంఈ విలువల సమాహారంగా వికసిత భారత్‌ను నిర్మించాలని పిలుపునిచ్చారు. "ఈ పవిత్ర సదన్‌లోనే భారత రాజ్యాంగం రచించబడింది" అని గుర్తు చేశారు.

## హైదరాబాద్‌లో సాఫ్రన్ ఎయిరోస్పేస్ ఫెసిలిటీ ఆవిష్కరణ

- ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోడీ
- తెలంగాణ అభివృద్ధికి కొత్త మైలురాయి
- దేశంలోనే హైదరాబాద్ ప్రధాన ఎయిరోస్పేస్, డిఫెన్స్ హబ్‌గా మారింది
- బెంగుళూరు -హైదరాబాద్‌ను డిఫెన్స్ మరియు ఎయిరోస్పేస్ కారిడార్‌గా ప్రకటించాలి
- సీఎం రేవంత్ రెడ్డి







**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్‌లో సాఫ్రన్ ఎయిరోస్పేస్ ఫెసిలిటీ సెంటర్‌ను నెలకొల్పడం తెలంగాణ అభివృద్ధిలో ఒక మైలురాయిగా నిలుస్తుందని ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు వ్యాఖ్యానించారు. ఫ్రాన్స్‌కు చెందిన సాఫ్రన్ సంస్థ ఎయిర్ క్రాఫ్ట్ ఇంజిన్ సర్వీసెస్ ఇండియా హైదరాబాద్ జీఎంఆర్ ఎయిరోపార్క్ (ఎస్ఈజెడ్) లో నెలకొల్పిన ఫెసిలిటీ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఢిల్లీ నుంచి వర్చువల్ గా ఈ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ హైదరాబాద్ దేశంలోనే ప్రధాన ఎయిరోస్పేస్, డిఫెన్స్ హబ్‌గా మారిందని చెప్పారు. ఈ అంశాలను పరిగణలోకి తీసుకుని బెంగుళూరు - హైదరాబాద్‌ను డిఫెన్స్ మరియు ఎయిరోస్పేస్ కారిడార్‌గా ప్రకటించాలని ప్రధానమంత్రి గారికి విజ్ఞప్తి చేశారు.

ఎయిరోస్పేస్ రంగంలో ముఖ్యంగా వాటి నిర్వహణ, మరమ్మత్తులు, ఓవర్‌హాల్ వంటి సదుపాయాలతో పాటు పరికరాల తయారీ, పరిశోధన, అభివృద్ధి రంగాల్లో సాఫ్రన్, బోయింగ్, ఎయిర్ బస్, టాటా, భారత్ ఫోర్జ్ వంటి సంస్థలు హైదరాబాద్‌ను కేంద్రంగా ఎంచుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

"తెలంగాణపై ఎంతో నమ్మకంతో %ఋటుతీుఅ% గ్రూపు తన ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటుకు హైదరాబాద్‌ను ఎంపిక చేసుకున్నందుకు ఆ సంస్థకు మా అభినందనలు. ఈ సెంటర్ ఏర్పాటు ఎయిరోస్పెస్, రక్షణ రంగంలో తెలంగాణ అభివృద్ధిలో ఒక మైలురాయిగా నిలుస్తుంది. ఎయిర్ క్రాఫ్ట్ ఇంజిన్ సర్వీసులను అందించడంలో దేశంలోనే ఇది మొట్టమొదటి సెంటర్. ఈ ఫెసిలిటీ సెంటర్‌తో పాటు సాఫ్రన్‌కు చెందిన ఎం88 మిలటరీ ఇంజిన్ల నిర్వహణ, మరమత్తులు, ఓవర్ హాల్ (ఎంర్ఓ) కు శంకుస్థాపన చేసుకోవడం సంతోషకరమైన

మిగితా 2వ పేజీలో

## తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు ప్రధానికి ఆహ్వానం

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

డిసెంబర్ 8, 9 తేదీల్లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ -2025 ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు కేంద్ర మంత్రులను ఆహ్వానించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. గ్లోబల్ సమ్మిట్ నిర్వహణ, ఏర్పాట్లపై ముఖ్యమంత్రి గారు కమాండ్ కంట్రోల్ సెంటర్ లో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు , పొన్నం ప్రభాకర్, సలహాదారు వేం నరేందర్ రెడ్డితో పాటు పలు శాఖల ఉన్నతాధికారులతో సమీక్షించారు.

ఈ సమ్మిట్‌కు దేశ, విదేశాలకు చెందిన వ్యాపారవేత్తలు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను ఆహ్వానించేందుకు ముందుగానే జాబితాను సిద్ధం చేయాలని అధికారులకు చెప్పారు. సదస్సులో పాల్గొనే ఆహ్వానితులకు ఎక్కడా లోటు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.ఈ సదస్సుకు హాజరు కావాలని ఇప్పటికే 2600 మంది ప్రతినిధులకు ఆహ్వానాలు అందించామని సమావేశంలో అధికారులు వివరించారు. పెట్టుబడులకు సంబంధించి సదస్సులో ఒప్పందాలు కుదుర్చుకునే విషయంలో స్పష్టమైన ప్రణాళికతో ముందుకు వెళ్లాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు సూచించారు.

విభాగాల వారీగా వివిధ అంశాలపై మాట్లాడేందుకు వక్తలకు సంబంధించిన పక్కా ప్రణాళికను

మిగితా 2వ పేజీలో

## దేశ ప్రజలకు ప్రధాని బహిరంగ లేఖ



**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**


దేశ పౌరుల రాజ్యాంగ విధులే బలమైన ప్రజాస్వామ్యానికి పునాదులని ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పష్టం చేశారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బుధవారం దేశ ప్రజలకు ప్రత్యేకంగా బహిరంగ లేఖ విడుదల చేసిన ఆయన, ప్రతి పౌరుడు బాధ్యతలను నిర్వర్తించడం ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ తమ ఓటుహక్కును వినియోగించి ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని మోదీ ప్రస్తావించారు. దేశవ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల్లో రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించాలని, తాజాగా 18 ఏళ్లకు చేరి ఓటుహక్కు పొందిన యువతను ప్రత్యేకంగా సత్కరించాలని సూచించారు.

గాంధీజీ నమ్మిన విధంగా బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించినప్పుడే సమాజంలో హక్కులు ఏర్పడతాయని ప్రధాని పేర్కొన్నారు. సమాజం బాధ్యతాయుతంగా వ్యవహరిస్తేనే సామాజిక, ఆర్థిక వికాసానికి పునాదులు పడతాయని గుర్తుచేశారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో సర్దార్ పటేల్, గాంధీ, బిర్సా ముండా వంటి మహానుభావులు చేసిన త్యాగాలను స్మరించుకుంటూ, వారి విలువలు రాజ్యాంగ విధులను స్ఫూర్తిగా నిలిపాయని మోదీ అన్నారు. డా. బీఆర్ అంబేద్కర్, డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ తదితరులు భారత రాజ్యాంగ రచనలో విశిష్టమైన పాత్ర పోషించారని ప్రధాని కొనియాడారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 51ఏ పేర్కొన్న ప్రాథమిక విధులు దేశం సమగ్రాభివృద్ధి దిశగా ముందుకు

మిగితా 2వ పేజీలో

## రియల్ ఎస్టేట్ దళారుల ప్రయోజనాలకోసమే ప్రభుత్వం

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో పారిశ్రామిక భూముల మార్పిడి, మున్సిపాలిటీల విలీనం విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని "అవినీతి అనకొండ"గా అభివర్ణించిన ఆయన, "ప్రజల నుంచి సేకరించిన భూములను రియల్ ఎస్టేట్ దళారులకు ధారాదత్తం చేసే కుట్ర ఇది" అని ఆరోపించారు.

పరిసర మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను జీహెచ్ఎంసీ పరిధిలో విలీనం చేసే ప్రతిపాదనపై కేటీఆర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మాజీ సీఎం కేసీఆర్ పాలనలో 10 జిల్లాలు 33గా పెరగడం, కొత్త డివిజన్లు, కొత్త పురపాలకలు, తాండాల అప్‌గ్రేడ్, గ్రామ పంచాయతీలు 8,800 నుండి 12,800కు పెరగడం వంటి వికేంద్రీకరణ చర్యలను గుర్తుచేశారు. "ఈ విలీనంపై ప్రభుత్వం ఎవరితో చర్చించింది? మున్సిపాలిటీల్లో తీర్మానాలు లేవు. ప్రజల అభిప్రాయ సేకరణలేదు. శాసనసభ లేదా అఖిలపక్ష సమావేశం లేదు. మరి ఈ నిర్ణయం ఎవరి ప్రయోజనం కోసం?" అని కేటీఆర్ ప్రశ్నించారు. హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ పేరుతో పరిశ్రమలకు కేటాయించిన భూములను అపార్ట్‌మెంట్లు, విల్లాలకు అనుమతించడం ఆశ్చర్యకరమని కేటీఆర్ అన్నారు. గత ప్రభుత్వాలు 9,300 ఎకరాల పరిశ్రమల భూమిని ఉద్యోగావకాశాల కోసం సేకరించాయని రైతులకు తక్కువ ధర చెల్లించి సబ్సిడీపై పరిశ్రమలకు కేటాయించిన ఆ భూముల్లో ఇప్పుడు రియల్ ఎస్టేట్ నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్నారని విమర్శించారు

"అడ్డికి పావుశేరు చొప్పున మార్కెట్ రేటు కాదు%ౌ% ప్రభుత్వ రిజిస్ట్రేషన్ వాల్యూలో 30% మాత్రమే చెల్లించి భూమిని మార్చుకోవడానికి రేవంత్ రెడ్డి అనుమతిస్తున్నాడు" అని కేటీఆర్ ఆరోపించారు. హైదరాబాద్, వరంగల్ వంటి నగరాల్లో ప్రజా అవసరాలకు స్థలం దొరకడం లేదని, అయినప్పటికీ పారిశ్రామిక భూములను అపార్ట్‌మెంట్లకు మార్చడం తీవ్రమైన దోపిడీ అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. "9,300 ఎకరాలు అంటే కనీసం ?5 లక్షల కోట్ల విలువ. ఈ ఆస్తిని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడం రేవంత్ రెడ్డి%- ఆయన అనుచరులు నడుపుతున్న భారీ కుంభకోణం" అని కేటీఆర్ అన్నారు.

రేవంత్ రెడ్డి, ఆయన అన్నదమ్ములు, అనుచరులు కలిసి 'అవినీతి అనకొండ'లా వ్యవహరిస్తున్నారని కేటీఆర్ ఘాటుగా విమర్శించారు. ప్రైవేటు వ్యక్తులకు మాల్స్, అపార్ట్‌మెంట్లు నిర్మించేందుకు అనుమతులు వందల కోట్ల లాభాలు పొందేందుకు విధానాలు ప్రజల ఉపాధి కోసం సేకరించిన భూములు రియల్ ఎస్టేట్‌కు మళ్లింపు ఇవి అన్నీ ప్రభుత్వ ప్రణాళికాబద్ధ చర్యలేనన్న ఆరోపణలు చేశారు. హైదరాబాద్‌లో కాలుష్య కారక

మిగితా 2వ పేజీలో

## లారీ ఢీకొని దంపతులు మృతి

**బలగం టీవి, హైదరాబాద్**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ అర్బన్ మండలం ఆరేపల్లి సమీపంలో ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొట్టడంతో దంపతులు మృతిచెందారు. చిన్నారికి గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి.. కామారెడ్డికి చెందిన వసీం(27), ఐఫా(22) దంపతులు. వారికి ఒక కుమార్తె. బుధవారం భార్యాభర్తలు చిన్నారితో కలిసి ద్విచక్ర వాహనంపై చిన్నారితో కలిసి వెళ్తుండగా.. కరీంనగర్ వైపు వెళ్తున్న వారిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వసీం, ఐఫా అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన చిన్నారికి కాలు విరిగినట్లు సమాచారం. స్థానికులు వెంటనే స్పందించి చిన్నారిని కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## రాజన్న సిరిసిల్లలో సర్పంచ్ ఏకగ్రీవం

**బలగం టీవి, రుద్రంగి**

రాష్ట్రవ్యాప్తంగా సర్పంచ్ ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయా అని ఆశతో ఎదురు చూస్తున్న నాయకులు, ఆసక్తి ఉన్న అభ్యర్థులు గ్రామాల్లో ఓటర్లను ఆకట్టుకునే పనిలో పడ్డారు. అయితే ఎన్నికల నోటిఫికేషన్ వెలువడకముందే రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం రూప్ల తండా గ్రామంలో సర్పంచ్‌తో పాటు ఎనిమిది వార్డు సభ్యుల ఎన్నిక ఏకగ్రీవంగా పూర్తయి ప్రత్యేకంగా నిలిచింది. గ్రామంలో మొత్తం 390 మంది జనాభా ఉండగా, పార్టీలకు అతీతంగా గ్రామస్తులు ఏకాభిప్రాయంతో జవహర్లాల్ నాయక్‌ను సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. గ్రామ సమస్యలపై అవగాహన, నిధుల సమస్యలు లేకుండా తండాను అభివృద్ధి చేస్తానని ఇచ్చిన హామీ జవహర్లాల్ నాయక్‌కు అధిక ప్రాధాన్యం తీసుకువచ్చిందని తాండా పెద్దలు తెలిపారు. ఎన్నిక ఏకగ్రీవమవడంతో గ్రామంలో ఆనందోత్సాహాలు చెలరేగాయి. సర్పంచ్ జవహర్లాల్ నాయక్‌ను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. పంచాయతీ పరిధిలో ప్రతి సమస్యను పరిష్కరించి అభివృద్ధికి కృషి చేస్తానని నూతన సర్పంచ్ తెలిపారు. రూప్ల తండా ఈసారి జిల్లాలోనే మొదటి ఏకగ్రీవ పంచాయతీగా నిలిచింది. కార్యక్రమంలో తాండా పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

- ఎన్నికల ప్రవర్తనా నియమావళి కట్టుదిట్టంగా అమలు
- నామినేషన్ల స్వీకరణకు పటిష్ట ఏర్పాట్లు
- రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ. రాణి కుముదిని
- పంచాయతీ ఎన్నికల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ ఐ. రాణి కుముదిని ఆదేశించారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ ఐ. రాణి కుముదిని అన్ని జిల్లాల కలెక్టర్లతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ రాణి కుముదిని మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న గ్రామ పంచాయతీలకు 2వ సాధారణ ఎన్నికలను మూడు విడతల్లో నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసిందని, డిసెంబర్ 11న మొదటి విడత, డిసెంబర్ 14న రెండవ విడత, డిసెంబర్ 17న మూడవ విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్ జరగనున్నట్లు తెలిపారు.పంచాయతీ ఎన్నికల సంబంధించి గ్రామానికి అప్ డేట్ చేసిన రిజర్వేషన్లు,

మిగితా 4వ పేజీలో

## ఇమ్రాన్ ఖాన్‌ను చంపేశారన్న వార్తలతో పాక్‌లో ఉద్రిక్తత

వివరాలు 2వ పేజీలో

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మిషన్ కమీషన్

- ఎమ్మెల్యే హరీశ్‌రావు





**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మిషన్ కమీషన్ అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. మొన్న దేశంలోనే పెద్ద భూకుంభకోణాన్ని బీఆర్ఎస్ బయటపెట్టిందన్నారు. ఇప్పుడు రూ.50 వేల కోట్ల విద్యుత్ కుంభకోణానికి రేవంత్ సర్కారు రూపకల్పన చేసిందని చెప్పారు. ఆధారాలతో సహా బయటపెడుతున్నామని అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ రూ.50 వేల కోట్ల విద్యుత్ కుంభకోణంలో దాదాపు 30 నుంచి 40 శాతం కమీషన్లు దండుకోబోతున్నారని చెప్పారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎప్పుడు ఏది మాట్లాడినా, ఏం చేసినా.. ఏది చెయ్యకున్నా దాని వెనుక ఒకే ఒక్క మిషన్ ఉంటుందనీ, అదే కమీషన్ అని అన్నారు. ఏ స్కీంను ఎలా పటిష్టంగా అమలు చేయాలి, ప్రజల సంక్షేమం, అభివృద్ధి గురించి మంత్రివర్గం చర్చిస్తుందనీ, కానీ కాంగ్రెస్ నేతృత్వంలోని మంత్రివర్గం స్కాంల గురించి ఆలోచన చేస్తున్నదని ఆరోపించారు. కాంగ్రెస్ మంత్రివర్గం ఓ దండుపాళ్యం బ్యాచ్ అని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పాలన సంక్షేమానికి కేరాఫ్ అడ్రస్‌గా ఉంటే, కాంగ్రెస్ పాలన బడా స్కాంలకు, అరాచకాలకు

కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిందని అన్నారు. వాటాలు, పంపకాల్లో తేడా రావడంతో మంత్రులే బయటకు వచ్చి ఒకరి మీద ఒకరు నిందలు వేసుకుంటున్నారని గుర్తు చేశారు. హెచ్ఐఎల్‌టీపీ విధానం సీఎం ఒక్కరి నిర్ణయం కాదనీ, మంత్రివర్గ ఉపసంఘానిది అని మంత్రులు మాట్లాడారని అన్నారు. ఈ స్కాంలలో సీఎం రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులందరికీ వాటా ఉందన్నారు.

రామగుండం, పాల్వంచ, మక్తల్‌లో 800 మెగావాట్ల చొప్పున 2,400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయాలని మంత్రివర్గం నిర్ణయించిందని హరీశ్‌రావు చెప్పారు. రామగుండంలో 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్మాణానికి ఎన్టీపీసీ, జెన్‌కోకు అవకాశం కల్పిస్తామనీ, ఏది తక్కువ వ్యయంతో నిర్మిస్తే దానికే అవకాశం ఇస్తామంటున్నారని అన్నారు. ఒక మెగావాట్ విద్యుత్ ఉత్పత్తికి రూ.12.23 కోట్ల ఖర్చు అవుతుందంటూ ఎన్టీపీసీ చెప్పిందన్నారు. అదే విధంగా ఒక మెగావాట్ విద్యుత్ ఉత్పత్తికి రూ.14 కోట్లు ఖర్చవుతాయంటూ జెన్‌కో పేర్కొందని వివరించారు. ఎన్టీపీసీ, జెన్‌కో డీపీఆర్‌లు ప్రభుత్వం వద్ద ఉన్నా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం డ్రామాలు ఆడుతున్నదని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఒక మెగావాట్ ఉత్పత్తికి యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో రూ.8.63 కోట్లు, భద్రాద్రి విద్యుత్ కేంద్రంలో రూ.9.74 కోట్లు, ఎన్టీపీసీలో రూ.12.23 కోట్లు ఖర్చయ్యిందని వివరించారు. కమీషన్లు దండుకోవడానికి జెన్‌కోకు రూ.14 కోట్లకు ఖరారు చేసే అవకాశముందన్నారు. ఒక్కో మెగావాట్‌కు రూ.5,600 కోట్ల చొప్పున 2,400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి రూ.15 వేల కోట్ల నుంచి రూ.20 వేల కోట్లు అధికంగా ఖర్చు చేయాల్సి వస్తుందని చెప్పారు. రామగుండంలో ప్రాజెక్టు వ్యయం

మిగితా 2వ పేజీలో

## నకిలీ ఐపీఎస్ అధికారి అరెస్టు






**బలగం టీవి, హైదరాబాద్**

నగరంలో నకిలీ ఐఏఎస్, ఐపీఎస్‌గా అవతారమెత్తి ప్రజలను మోసం చేస్తున్న వ్యక్తిని ఫిల్మ్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం ఏసీగార్డ్స్‌లోని డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ ఎస్.వెంకటరెడ్డితో కలిసి డీసీపీ శ్రీనివాస్ వివరాలను వెల్లడించారు. ఏపీ కర్నూల్‌కు చెందిన బత్తిని శశికాంత్ షేక్‌పేట్‌లోని అపర్ణ ఔరా అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్నాడు. 3-డీ ఏనిమేషన్ కోర్సు పూర్తి చేశాడు. చిన్న కంపెనీని ఏర్పాటు చేసిన నిందితుడు ఏనిమేషన్‌ను ఉపయోగించి అతని పేరిట ఐఏఎస్, ఐపీఎస్, ఎన్ఐఏ అధికారినంటూ ఐడెంటిటీ కార్డులను తయారు చేసుకున్నాడు. నేరాలల్లో ఆరితేరిన నిందితుడు రెండేండ్లుగా గనుల శాఖ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేశానని, కొద్ది రోజుల క్రితమే పోలీస్, ఎన్ఐఏలో ప్రత్యేక ఆపరేషన్ల కోసం తనను ప్రభుత్వం నియమించిందని పలువురిని నమ్మించాడు. ఎవరికీ అనుమానం రాకుండా సైరన్ కార్లు, వాకీ-టాకీలు ఉపయోగించేవాడు. తమిళనాడుకు చెందిన రిటైర్డ్ సీఆర్‌పీఎఫ్ జవాన్లు ప్రవీణ్, విమల్‌ను గన్‌మెన్లుగా నియమించుకున్నాడు. గన్‌మెన్లతో కలిసి షేక్‌పేటలోని గోల్డ్ జిమ్‌కు వెళ్లేవాడు. జిమ్‌తోపాటు చుట్టుపక్కల హడావిడి చేసేవాడు. మరికొన్ని ప్రాంతాలల్లో టీఎస్ఐఐసీలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్నానని, ఖాళీ స్థలాలు కేటాయించే విభాగానికి ప్రత్యేక ఐఏఎస్ అధికారినంటూ ప్రచారం చేసుకున్నాడు. పరిశ్రమ స్థాపనకు స్థలం కేటాయింపు జరిగిందటూ నకిలీ అలాట్‌మెంట్ ఆర్డర్‌ను తయారు చేసిన నిందితుడు జిమ్ ఓనర్ ఎండీ అలీ హసన్‌కు అందించాడు. అందుకుగానూ రూ.10,50,665 లక్షల నగదును బ్యాంక్ నుంచి బదిలీ చేయించుకున్నాడు. జిమ్‌కు వచ్చే మరో వ్యక్తి నుంచి భారీగా డబ్బులు వసూలు చేశాడు. అయితే ఆ భూములు వారిపై బదిలీకాకపోవడంతో అనుమానం వచ్చిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అన్ని కోణాలల్లో విచారించిన ఫిలింనగర్ పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. నిందితుడు గత రెండు సంవత్సరాలుగా ప్రజలను నమ్మించి మోసాలకు పాల్పడినట్టు తేలిందని డీసీపీ తెలిపారు. అమాయకుల నుంచి భారీగా డబ్బులు సంపాదించాడని తెలిపారు. నిందితుడి నుంచి రెండు సెల్‌ఫోన్లు, ఆరు సిమ్‌కార్డులు, రెండు వాకీటాకీలతోపాటు నకిలీ ఐఏఎస్, ఐపీఎస్, ఎన్ఐఏ అధికారుల గుర్తింపు కార్డులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న నిందితుడి గన్‌మెన్లను త్వరలోనే అరెస్టు చేస్తామని డీసీపీ తెలిపారు.

## ఎస్సై సర్వీస్ రివాల్వర్ మిస్సింగ్

- ఆర్థిక ఇబ్బందులతో తాకట్టు పెట్టాడని అనుమానాలు
- అదుపులోకి తీసుకుని విచారిస్తున్న పోలీసులు



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రికవరీ చేసిన బంగారాన్ని తాకట్టు పెట్టడంతో పాటు తన సర్వీస్ రివాల్వర్‌ను పోగొట్టుకున్న అంబర్‌పేట ఎస్సై ఉదంతం పోలీస్ శాఖలో కలకలం రేపింది. బెట్టింగ్ యాప్‌లో డబ్బులు పోగొట్టుకొని ఆర్థిక ఇబ్బందులతోనే ఎస్సై రికవరీ బంగారాన్ని తాకట్టు పెట్టినట్టు తెలుస్తోంది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.

2020 బ్యాచ్‌కు చెందిన ఎస్సై భాను ప్రకాష్ గతంలో హబీబ్ నగర్ పోలీస్ స్టేషన్‌లో పనిచేశారు. ఏడాదిన్నర క్రితం అంబర్ పేట పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వచ్చిన ఆయన ముందు డిటెక్టివ్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తించాడు. ప్రస్తుతం డీడీ కాలనీ సెక్టార్ ఎస్సైగా ఆయన పని చేస్తున్నాడు. అయితే క్రైం ఎస్సైగా పని చేస్తున్న సమయంలో ఓ చోరీ కేసులో రికవరీ చేసిన నాలుగున్నర తులాల బంగారాన్ని ఆయన పాన్ బ్రోకర్ వద్ద తాకట్టు పెట్టాడు. వచ్చిన డబ్బును సొంత అవసరాలకు వాడుకుని, ఆ కేసును కూడా క్లోజ్ చేశాడు. అయితే ఈ కేసుకు సంబంధించిన ఫిర్యాదుదారుడు తన రికవరీ సొత్తును ఇవ్వాలని అడిగినా ఇవ్వకపోవడంతో అతను విషయాన్ని ఉన్నతాధికారుల దష్టికి తీసుకెళ్లాడు. దీంతో విషయం బయటకు వచ్చింది. దీనిపై విచారణ చేపట్టిన అధికారులకు ఎస్సై భానుప్రకాష్‌కు పోలీస్ శాఖ కేటాయించిన 9 ఎంఎం సర్వీస్ రివాల్వర్ కూడా పోయినట్టు తెలిసింది. రివాల్వర్ పోగొట్టుకున్న విషయంలో ఉన్నతాధికారులు ఎస్సైని ఎంత అడిగినా ఆయన పెదవి విప్పడం లేదని సమాచారం. దీంతో ఈ నెల 22న ఎస్సైని ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. సర్వీస్ రివాల్వర్ ఎక్కడికి పోయిందనే విషయాన్ని పోలీసులు సీరియస్‌గా తీసుకుని ఎస్సైని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఈ సంఘటన పోలీసు శాఖకు మచ్చ తేవడంతో పాటు సంచలనం రేపుతోంది.

# తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు ప్రధానికి ఆహ్వానం



(మొదటి పేజీ తరువాయి)

సిద్ధం చేసుకోవాలని, వక్తలకు సమయం ముందుగానే నిర్దేశించి క్రమశిక్షణతో కూడిన ప్రణాళిక ఉండాలని చెప్పారు. ఒక్కో ఈవెంట్‌కు ఒక్కో సీనియర్ ఐఏఎస్ అధికారిని బాధ్యుడిగా నియమించాలని సూచించారు. సమ్మిట్ కోసం ఏర్పాటు చేస్తున్న స్టాల్స్ డిజైన్లను అధికారులు వివరించారు. మౌలిక సదుపాయాల కల్పన, సంక్షేమం, పరిశ్రమలు, వైద్య రంగాలకు సంబంధించిన స్టాల్స్ విషయంలో సీఎం గారు అవసరమైన జాగ్రత్తలను సూచించారు. సమ్మిట్ సందర్భంగా ప్రదర్శించే డ్రోన్ షో తెలంగాణ బ్రాండ్ ఇమేజీని పెంచే విధంగా ఉండాలని, అదే రీతిలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఈ సదస్సుకు సంబంధించి అన్ని డిజైన్లు నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.

## హైదరాబాద్‌లో
# సాఫ్రన్ ఎయిరోస్పేస్ ఫెసిలిటీ ఆవిష్కరణ

(మొదటి పేజీ తరువాయి)

పరిణామం. ఈ MRO భారత వైమానిక దళం, నావికాదళానికి ఎంతో ఉపయోగపడుతుంది. సాఫ్రన్ దాదాపు 1300 కోట్ల రూపాయల ప్రారంభ పెట్టుబడితో ఏర్పాటు చేసిన ఈ సెంటర్ ద్వారా వెయ్యి మందికిపైగా నైపుణ్యం కలిగిన సాంకేతిక నిపుణులు, ఇంజనీర్లకు ఉపాధి లభిస్తుంది. పెట్టుబడులను ఆహ్వానించడం, పారిశ్రామికాభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ప్రగతిశీల విధానాలను అవలంభిస్తోంది. తెలంగాణ అమలు చేస్తోన్న ఎస్ఎంఈ విధానం దేశంలోనే అత్యుత్తమమైన వాటిల్లో ఒకటిగా నిలిచింది. ఇక్కడి ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, ఎయిరోస్పేస్ పార్కులు, ఎస్ఈజెడ్‌లు ప్రపంచ స్థాయి ప్రముఖ కంపెనీల నుంచి భారీ పెట్టుబడులను ఆకర్షించాయి.ఎయిరోస్పేస్ రంగంలో గతేడాది ఎగుమతులు రెట్టింపయ్యాయి. గడిచిన 9 నెలల కాలంలో ఎగుమతులు 30 వేల కోట్లకు పైగా చేరుకుని, మొదటిసారి ఫార్మా ఎగుమతులను అధిగమించడం గమనార్హం. ఎయిరోస్పేస్ రంగంలో తెలంగాణ కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ నుంచి అవార్డును పొందింది.

రాష్ట్రంలో నెలకొల్పిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా విమానాల నిర్వహణ అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇచ్చే అంశంపై ప్రభుత్వం దృష్టి పెడుతోంది. నైపుణ్యతను మెరుగుపరచడానికి టాటా టెక్నాలజీస్ సంస్థ భాగస్వామ్యంతో రాష్ట్రంలోని 100 ఐటీఐలను అడ్వాన్స్ డ్ టెక్నాలజీ సెంటర్లుగా తీర్చిదిద్దాం.ప్రపంచ దేశాల్లోనే అగ్రశ్రేణి నగరాలతో పోటీ పడాలన్న సంకల్పంతో హైదరాబాద్ విమానాశ్రయం సమీపంలో




30 వేల ఎకరాల విస్తీర్ణంలో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నాం. తెలంగాణ సమగ్ర అభివృద్ధి కోసం స్పష్టమైన ప్రణాళికను ఆవిష్కరించడానికి డిసెంబర్ 8, 9 తేదీల్లో ఫ్యూచర్ సిటీలో నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు అందరినీ ఆహ్వానిస్తున్నాం.

భారత లక్ష్యాలను చేరుకోవడంలో భాగస్వామిగా ఉండాలని, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తెలంగాణను తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నాం..” అని ముఖ్యమంత్రి గారు వివరించారు.ఈ కార్యక్రమంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు , రాష్ట్ర పరిశ్రమలు ఐటీ శాఖ మంత్రి శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబు , సాఫ్రన్ గ్రూప్ చైర్మన్ శ్రీ రాస్ మెకలెన్స్ , సీఈఓ, డైరెక్టర్ శ్రీ ఒలివర్ అండ్రీస్, ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్స్ సీఈవో శ్రీ స్టీఫేన్ క్యూయెల్ గారు, జీఎంఆర్ గ్రూపు సంస్థల చైర్మన్ జీఎం రావు గారితో పాటు ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మిషన్ కమీషన్

(మొదటి పేజీ తరువాయి)

రూ.10,880 కోట్ల నుంచి రూ.15 వేల కోట్లకు పెరుగుతుందని అన్నారు. ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం రామగుండంలో రూ.నాలుగు వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకు ఎన్టీపీసీ 1,600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసిందని గుర్తు చేశారు. ఇంకా 2,400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయాల్సి ఉందన్నారు. దాని ఉత్పత్తి కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటే తక్కువ ఖర్చుతో విద్యుత్ సరఫరా చేయొచ్చని అన్నారు. రేవంత్‌రెడ్డి అపరిచితుడు, చంద్రముఖిలా మారిపోతున్నారని చెప్పారు.

విద్యుత్‌ను అదానీ, అంబానీకి ఇచ్చేందుకు కుట్ర

విద్యుత్‌రంగ ప్రయివేటీకరణ కోసమే కొత్త డిస్కం తెస్తున్నారని హరీశ్‌రావు విమర్శించారు. పథకాల కోసం ఒక డిస్కం ఏర్పాటు చేస్తే లాభాలు వచ్చే డిస్కంలను అంబానీ, అదానీలకు ప్రయివేటు పరం చేసేందుకు కుట్ర జరుగుతున్నదని అన్నారు. ఆదాయమే రాని డిస్కంల నిర్వహణ ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. బీజేపీ ప్రభుత్వం డైరెక్షన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి యాక్షన్ చేస్తున్నారని అన్నారు. త్వరలో హైదరాబాద్ అండర్ గ్రౌండ్ కేబుల్ స్కాం, పంపుడ్ స్టోరేజీ, బ్యాటరీ స్టోరేజీ స్కాం బయటపెడుతామన్నారు. త్వరలో రేవంత్‌రెడ్డి చేసే ఇంటర్ స్టేట్ స్కాంను ఆధారాలతో సహా బయటపెడతామని చెప్పారు. తాము ప్రతిపక్షంగా ప్రజల తరుపున ప్రభుత్వ స్కాంలు, అన్యాయాలపై ప్రశ్నిస్తే తమపై విచారణలంటూ బెదిరిస్తున్నారని అన్నారు. ఈ స్కాంలపై అవసరమైతే బీఆర్ఎస్ న్యాయ పోరాటానికి సిద్ధమవుతుందని చెప్పారు. బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటి కాకుంటే ఈ స్కాంలపై విచారణ జరపాలనీ, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రులు గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఇమ్రాన్ ఖాన్‌ను చంపేశారన్న వార్తలతో పాక్‌లో ఉద్రిక్తత

బలగం టీవీ, హైదరాబాద్

పాకిస్తాన్ మాజీ ప్రధాని, పాక్ తెహ్రీక్-ఇ-%ఇన్సాఫ్ (పీటీఐ) ప్రధాన నేత ఇమ్రాన్ ఖాన్ జైలులో హత్యకు గురయ్యారనే వార్తలు సోషల్ మీడియాలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఐఎస్ఐ, ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ ఈ కుట్రకు పాల్పడ్డారన్న ఆరోపణలు భారీగా ప్రచారం అవుతున్నప్పటికీ, వాటిలో ఎంతవరకు నిజం ఉందన్న విషయంలో అధికారికంగా ఎటువంటి స్పష్టత లేదు. పాక్ ప్రభుత్వం ఈ అంశంపై ఇప్పటివరకు స్పందించకపోవడం అనుమానాలకు మరింత తావు ఇచ్చింది.ఇమ్రాన్ ఖాన్ సోదరీమణులు నోరీన్ ఖాన్, అలీమా ఖాన్, ఉజ్మా ఖాన్ మంగళవారం రాత్రి రావల్పిండిలోని అడియాలా జైలుకు వెళ్లినా, వారిని లోపలికి అనుమతించలేదు. దాంతో ఆందోళన వ్యక్తం చేసినవారు, తమపై పోలీసులు దాడి చేశారని ఆరోపించారు. 2023 నుంచి అడియాలా జైలులో ఉన్న ఇమ్రాన్‌ను గత మూడు వారాలుగా కలవనివ్వడం లేదని వారు తెలిపారు.

తమ సోదరుడిని కలిసేందుకు శాంతియుతంగా వేచిచూస్తుంటే, పోలీసులు క్రూరంగా దాడి చేశారని పీటీఐ ఆరోపించింది. రాత్రి అకస్మాత్తుగా వీధిలైట్లు ఆపివేసి, చీకట్లోకి నెట్టి, ఆ తర్వాత బలప్రయోగం చేశారని నోరీన్ ఖాన్ తెలిపారు. 71 ఏళ్ల వయసున్న తనను జుట్టు పట్టుకుని నేలకేసి పడేశారని, రోడ్డుపై ఈడ్చుకెళ్లారని ఆమె కన్నీళ్లతో చెప్పుకొచ్చారు. దాడిలో పాల్గొన్న పోలీసులపై తక్షణ చర్యలు తీసుకోవాలని పంజాబ్ ఐజీపీకి ఖాన్ సోదరీమణులు డిమాండ్ చేశారు.

ఇమ్రాన్ ఖాన్ అనేక కేసుల్లో 2023 ఆగస్టు నుంచి జైలులో ఉన్నారు. సోషల్ మీడియాలో ఆయన మరణించారంటూ వార్తలు రావడం, ప్రభుత్వంపై నెలకుపైగా సమావేశాల నిషేధం అమలు చేయడం పట్ల పీటీఐ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఖాన్ న్యాయవాది మాట్లాడుతూ, పుస్తకాలు, అవసరమైన వస్తువులు, న్యాయవాదులకే ప్రవేశం నిరాకరించడం ఆందోళన కలిగించే అంశమని అన్నారు. “ఇక్కడ అటవీ చట్టం నడుస్తోంది%ౌ% పాలించే మృగానికి మాత్రమే హక్కులున్నాయి” అని ఖలీద్ యూసఫ్ చౌదరి వ్యాఖ్యానించారు.

ముఖ్యమంత్రి సోహైల్ అఫ్రిది కూడా ఇమ్రాన్ ఖాన్‌ను కలవడానికి వరుసగా ఏడు సార్లు చేసిన ప్రయత్నాలను జైలు అధికారులు తిరస్కరించారు. ఒక సైనిక అధికారి ఆదేశాల మేరకే ఇది జరుగుతోందని ఆయన ఆరోపించారు.




# తెలుగు వెర్షన్‌లో భారత రాజ్యాంగం విడుదల

## రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరణ

బలగం టీవీ, హైదరాబాద్

రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా భారత రాజ్యాంగం తెలుగు వెర్షన్‌ను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం అధికారికంగా విడుదల చేశారు. ప్రాంతీయ భాషలో రాజ్యాంగాన్ని అందుబాటులోకి తేవడం రాష్ట్రంలో ప్రజలకు రాజ్యాంగంపై అవగాహన పెరిగేందుకు దోహదం చేస్తుందని ఈ సందర్భంగా సిఎం పేర్కొన్నారు. రాజ్యాంగం అతి సామాన్యులకు కూడా సులభంగా అర్థమయ్యేలా తెలుగులో అనువదించి రూపుదిద్దిన విధానాన్ని సిఎం రేవంత్ రెడ్డి అభినందించారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ప్రతి పౌరుడు రాజ్యాంగాన్ని తెలుసుకోవడం అవసరమని, ఈ అనువాదం ఆ లక్ష్యాన్ని చేరుకోవడంలో కీలకభూమిక పోషిస్తుందని ఆయన అన్నారు. తెలుగు వెర్షన్ రూపకల్పన వివరాలను లా కార్యదర్శి బి. పాపిరెడ్డి సిఎంకు వివరణ ఇచ్చారు. రాజ్యాంగంలోని క్లిష్టమైన అంశాలను సులభ భాషలో ప్రజలకు చేరవేయడమే తమ ప్రధాన ఉద్దేశమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో లా అదనపు కార్యదర్శి కె. సునీత, సంయుక్త కార్యదర్శి కె. గీత తదితర అధికారులు పాల్గొన్నారు.

# కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయాలు

(మొదటి పేజీ తరువాయి)



వేసేందుకు వీలు కలుగుతుందని పేర్కొన్నారు. ఈ మార్గం ఖరడి నుంచి ఖడక్వాస్లా వరకు, నల్ స్టాప్ నుంచి మాణిక్ బాగ్ వరకు ఈ మెట్రో రైలు నడవనుందన్నారు. ట్రాఫిక్ జామ్‌తో నిత్య నరకం చూస్తున్న పుణే వాసులకు ఇది పెద్ద ఉపశమనం కలిగిస్తుందని మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆశాభావం వ్యక్తం చేశారు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని దిగుమతి చేసుకోవడాన్ని తగ్గించి.. స్వదేశంలోనే దీనిని అభివృద్ధి చేసుకునే దిశగా కేంద్రం అడుగులు వేస్తోంది. దాంతో రేర్ ఎర్త్ మ్యాగ్నెట్ ప్రొడక్షన్ (ఆర్ఈఎంపీ) పథకానికి కేంద్రం శ్రీకారం చుట్టింది. ఈ పథకానికి బడ్జెట్‌లో రూ. 7,280 కోట్లు కేటాయించింది. భారత్‌లో హైటెక్ మాగ్నెట్లను తయారు చేయడమే దీని లక్ష్యం. ఈ మాగ్నెట్లను ఎలక్ట్రిక్ వాహనాలు, మొబైల్ ఫోన్లలో ఉపయోగిస్తారు.

# దేశ ప్రజలకు ప్రధాని బహిరంగ లేఖ

(మొదటి పేజీ తరువాయి)

సాగేందుకు మార్గదర్శకాలు అని తెలిపారు. వికసిత భారత్ లక్ష్యం వైపు దేశం పయనిస్తున్న ఈ సమయంలో పౌరులు విధులను అత్యున్నత ప్రాధాన్యతగా భావించాలని మోదీ సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలు భవిష్యత్ తరాల జీవితాలను మలుస్తాయని పేర్కొన్నారు.

“దేశం మనకు ఎంతో ఇచ్చింది%ౌ% అదే ఆలోచన వస్తే ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా బాధ్యతలు నిర్వర్తించేందుకు ముందుకొస్తారు” అని మోదీ అన్నారు.

సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ దార్శనికతతోనే భారత రాజకీయ ఏకీకరణ సాధ్యమైందని మోదీ తెలిపారు. అదే స్ఫూర్తితో ఆర్టికల్ 370, 35ఏలను రద్దు చేసి, జమ్మూకశ్మీర్‌లో రాజ్యాంగం పూర్తిస్థాయిలో అమలు చేస్తున్నామని చెప్పారు. అణగారిన వర్గాలు, మహిళలకు రాజ్యాంగ హక్కులు అందేలా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు.

సామాన్య కుటుంబం నుంచి వచ్చిన తనలాంటి వ్యక్తి దేశ ప్రధానిగా ఎదగడానికి రాజ్యాంగమే కారణమని మోదీ పేర్కొన్నారు. “2014లో పార్లమెంటు భవనంలోకి తొలిసారి ప్రవేశించినప్పుడు ప్రజాస్వామ్య ఆలయమైన ఆ ప్రాంగణానికి వంగి నమస్కరించాను. 2019లో సెంట్రల్ హాల్‌లో భారత రాజ్యాంగ గ్రంథాన్ని తాకి నమస్కరించాను. రాజ్యాంగం నాకు కలలు కనే శక్తి ఇచ్చింది” అని ఆయన అన్నారు.రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. రాజ్యాంగం అందరికీ సమాన హక్కులు, గౌరవప్రద జీవితాన్ని ప్రసాదించిందని పేర్కొన్నారు. రాజ్యాంగ రచనలో అంబేద్కర్, రాజేంద్ర ప్రసాద్ పాత్రను స్మరించుకున్నారు.

# రియల్ ఎస్టేట్ దళారుల ప్రయోజనాలకోసమే ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి)

పరిశ్రమలను తరలించేందుకు కేసీఆర్ ఫార్మా సిటీ ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తుచేసిన కేటీఆర్, “అక్కడి భూమిలో 50% తిరిగి ప్రభుత్వానికి రావాలి అనేది మా ఆలోచన. అయితే ఇప్పుడు ఫ్యూచర్ సిటీని కూడా రియల్ ఎస్టేట్ పేరిట అమ్ముకోవాలన్నది ఈ ప్రభుత్వ ఉద్దేశం” అని అన్నారు.

రాహుల్ గాంధీ కోసం లక్షల కోట్ల సంపాదనకు మార్గం సుగమం చేసేందుకు ఈ పాలసీ తెచ్చారని కేటీఆర్ ఆరోపించారు.“రాబోయే 20%-%25 సంవత్సరాలకే కాదు, వారి ముని మనుమల కోసం కూడా ఆస్తులు సేఫ్ చేసుకునే కుట్ర ఇది” అన్నారు.

“ప్రజల నుంచి తీసుకున్న భూములను ‘నీ అబ్బ సొత్తు%-%నీ అత్త సొమ్ము’ అన్నట్టుగా ప్రభుత్వం ధారాదత్తం చేస్తే చూస్తూ ఊరుకోము” అని కేటీఆర్ స్పష్టం చేశారు.



# ప్రశ్నించే ఆయుధం రాజ్యాంగం..

- పముఖ కాలమిస్ట్ సంపతి రమేష్
- గడపగడపకు రాజ్యాంగాన్ని చేర్చడమే లక్ష్యంగా భారత రాజ్యాంగ పుస్తక పంపిణీ - జింక శ్రీధర్
- గురుకుల పాఠశాలలో భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు

**బలగం టీవీ, వేములవాడ**

వేములవాడ పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బహుజన సేన రాజన్న సిరిసిల్ల ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాజ్యాంగ పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్నికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రముఖ సామాజిక రచయిత మరియు కాలమిస్ట్ సంపతి రమేష్ మహారాజ్ మాట్లాడుతూ.. రాజ్యాంగం అంటే ప్రకరణాలు, నిబంధనల సమాహారం మాత్రమే కాదు. ఇది నవీన నాగరికతకు నాంది పలికే ఒక సజీవ పత్రం. భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అతిపెద్దది. రాజ్యాంగ రచన కమిటీ అధ్యక్షునిగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఒక అత్యున్నతమైన గ్రంథాన్ని మనకు అందించారు. భారత ప్రజల సంపూర్ణ ఆమోదం పొందడం, పౌరుల ఆత్మగౌరవం, సంక్షేమం కోసం నిలబడడం వల్ల ఇప్పటికి గొప్పగా వర్ధిల్లుతుంది. కోట్లాది ప్రజలకు విముక్తి కల్పించిన రాజ్యాంగానికి ప్రతి ఒక్కరు విధేయతగా ఉండాలి. అణగారిన వర్గాల ప్రశ్నించే ఆయుధం రాజ్యాంగం. సమానత్వాన్ని అర్థం చేసుకోవాలంటే బాల్య దశ నుంచి రాజ్యాంగ హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండాలి. ప్రతి విద్యార్థి కూడా రాజ్యాంగ విలువలను తెలుసుకొని భవిష్యత్తులో ఉన్నతంగా రాణించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రాజ్యాంగం పుస్తకాలను ఉచితంగా బహుకరిస్తున్న బహుజన సేన సంస్థను అభినందించారు.

బహుజనసేన రాజన్న సిరిసిల్ల ఆర్గనైజేషన్ అధ్యక్షుడు జింక శ్రీధర్ మాట్లాడుతూ.. నేటి సమాజం రాజ్యాంగం పై అవగాహన పెంచుకోవడం కోసం ప్రతి గడపకు రాజ్యాంగం చేర్చాలనే లక్ష్యంగా గత రెండు సంవత్సరాల నుండి రాజ్యాంగ పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, దేశ ప్రజలందరూ రాజ్యాంగం పై అవగాహన పెంచుకొని దేశ అభివృద్ధికి పాటుపడాలని కోరారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ముసాయిదా కమిటీ చైర్మన్గా 284 కమిటీ సభ్యులతో రెండు సంవత్సరాల 11 నెలల 18 రోజులు నిరంతరం శ్రమించి ప్రపంచంలో కెల్లా అతిపెద్ద లిఖిత పూర్వక రాజ్యాంగాన్ని దేశానికి అందించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బహుజన సేన జిల్లా ప్రధాన కార్యదర్శి లక్కే సాగర్, నేదూరి శ్రీకాంత్, అలువాల రాము, నేదూరి రాజు, ఎస్.కె ఫైజన్, ఎస్.కె అబ్దుల్ విక్రమ్ మరియు కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## మేడిపల్లి సత్యంను కలిసిన మండల కాంగ్రెస్ పార్టీ నాయకుల

**బలగం టీవీ, బోయినిపల్లి**

కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్షులుగా ఎన్నికైన సందర్భంగా చొప్పదండి నియోజకవర్గ శాసనసభ్యులు మేడిపల్లి సత్యంని రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి, శాలువతో సత్కరించి, పూల బుకె అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీఎంస్ చైర్మన్ ముదిగంటి సురేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వన్నెల రమణారెడ్డి, జిల్లా కాంగ్రెస్ కాంగ్రెస్ నాయకులు సంబ లక్ష్మీరాజం జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు ఎనుగుల కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

## కేరళ మోడల్ స్కూల్‌లో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు..

**బలగం టీవీ, ఇల్లంతకుంట**




ఇల్లంతకుంట మండల కేంద్రంలోని కేరళ మోడల్ హై స్కూల్ పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన నవంబర్ 26 రోజు పురస్కరించుకుని విద్యార్థుల్లో రాజ్యాంగ విలువలపై అవగాహన పెంపొందించే దిశగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాణం, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సేవలు, ప్రజాస్వామ్య మూల్యాల ప్రాధాన్యత గురించి పాఠశాల కరస్పాండెంట్ కృష్ణ కుమార్ ఉపన్యాసం నిర్వహించారు. విద్యార్థులు రాజ్యాంగ అంశాలపై ప్రసంగాలు, వ్యాసరచన, పోస్టర్–ప్రదర్శన, క్విజ్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. భారత రాజ్యాంగంలోని మూలాధికారాలు, విధులు, సమానత్వం, స్వాతంత్ర్యం, న్యాయం వంటి అంశాలపై అవగాహన పెంచే కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేరళ మోడల్ హై స్కూల్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ.. రాజ్యాంగం మన దేశానికి దిక్సూచిలాంటిదని, విద్యార్థుల్లో ప్రజాస్వామ్య భావజాలం, పౌర బాధ్యతల పట్ల చైతన్యం పెంపొందించడం మా విద్యాసంస్థ యొక్క ముఖ్య లక్ష్యం అని పేర్కొన్నారు. తదనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థిని, విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బిన్సీ, నరేష్, బాలకృష్ణ, ఏబీన్, ఘని, రాజేందర్, మహేందర్, లతో పాటు ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి)




ఏ విడత పోలింగ్ ఉంటుంది, పోలింగ్ కేంద్రాల జియో లోకేషన్ వివరాలు వెంటనే టి-పోల్ వెబ్ సైట్, యాప్ లో నమోదు చేయాలని అన్నారు. టి-పోల్ వెబ్ సైట్, యాప్ లో వచ్చే ఫిర్యాదుల పరిష్కారం కోసం జిల్లాలో నోడల్ అధికారిని నియమించాలని, ఎన్నికల కమిషన్ నుంచి వచ్చే ఫిర్యాదులను మూడు రోజులలో పరిష్కరించాలని సూచించారు. ఫైనల్ చేసిన ఓటర్ జాబితా, పోలింగ్ కేంద్రాల ప్రకారం పంచాయతీ ఎన్నికల నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. 2 కంటే ఎక్కువ పోలింగ్ కేంద్రాల్లో ఉన్న భవనం దగ్గర హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని, వెబ్ క్యాస్టింగ్ జరిగే పోలింగ్ కేంద్రాల వివరాలు పంపాలని , పోలింగ్ కేంద్రాలలో మంచి వెలుతురు, ఫర్నిచర్, పవర్ సరఫరా వంటి ఏర్పాట్లు చేయాలని అన్నారు.

గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి మొదటి విడత ఎన్నికల నోటిఫికేషన్ నవంబర్ 27న ఉదయం 10.30 గంటల వరకు విడుదల చేయాలని అన్నారు. నోటిఫికేషన్ జారీ చేయడంతో పాటు పంచాయతీ పరిధిలోని ఓటరు జాబితా వివరాలను ప్రచురించాలని అన్నారు. నవంబర్ 27 నుంచి నవంబర్ 29 వరకు ప్రతిరోజు ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లను స్వీకరించాలని ఆదేశించారు. పంచాయతీ ఎన్నికలకు సంబంధిత రిటర్నింగ్ అధికారులు వద్ద నామినేషన్ దాఖలు చేసేందుకు వీలుగా అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. నామినేషన్ల పరిశీలన నవంబర్ 30 న సాయంత్రం 5 గంటల వరకు పూర్తి చేసి చెల్లుబాటైనా నామినేటెడ్ అభ్యర్థుల జాబితాను ప్రకటించాలని అన్నారు. అభ్యర్థుల జాబితా పై అప్పీళ్ళ కోసం డిసెంబర్ 01, సాయంత్రం 5 గంటల వరకు గడువు ఉంటుందని, డిసెంబర్ 2 నాడు ఆపిళ్ళ పరిష్కరించాలని, నామినేషన్ల ఉపసంహరణకు డిసెంబర్ 03 మధ్యాహ్నం మూడు గంటల వరకు గడువు ఉంటుందని, అదే రోజు పోటీ చేసే అభ్యర్థుల జాబితా ప్రచురణ చేయాలని అన్నారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన,అప్పీళ్ళ పరిష్కారం, గుర్తుల కేటాయింపు, పోటి చేసే అభ్యర్థుల ప్రకటన పకడ్బందీగా జరిగేలా అవసరమైన మార్గదర్శకాల జిల్లా ఎన్నికల అధికారులు జారీ చేయాలన్నారు.

జిల్లాలో ఉన్న ప్రింటర్లకు అనుమతి లేకుండా ఎన్నికల ప్రచార కరపత్రాల ముద్రణ చేయవద్దని ఆదేశాలు జారీ చేయాలని, ఎన్నికల ప్రచారం సంబంధించి అభ్యర్థుల వ్యయ వివరాలను నమోదు చేసేందుకు ధరలను ఖరారు చేయాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలుపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని కలెక్టర్ లకు ఎన్నికల కమిషనర్ సూచించారు.

ప్రతి జిల్లాలో ఎం.సి.ఎం.సి కమిటి, జిల్లా మీడియా సెల్ ఏర్పాటు చేయాలని అన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో వినియోగించే ఎలక్ట్రానిక్ వీడియోలకు ముందుగా ఎం.సి.ఎం.సి అనుమతి ఉండాలని అన్నారు. ఎన్నికల దృష్ట్యా తనిఖీలు నిర్వహించే నేపథ్యంలో రైతులు పంట డబ్బులు తీసుకుని వెళ్లే సమయంలో తప్పనిసరిగా రశీదు పెట్టుకునేలా అవగాహన కల్పించాలని అన్నారు. ఎం.సి.సి అమలులో నిర్వహించే తనిఖీల లో నగదు, బంగారం, ఇతర పరికరాలు సీజ్ చేసే సమయంలో తప్పనిసరిగా రశీదు అందించాలని, సీజ్ చేసిన పరికరాలకు సంబంధించిన ఆధారాలు సమర్పించేందుకు ఏ అధికారి ముందు హాజరు కావాలని వివరాలు ఆ రసీదు లో ఉండాలని అన్నారు.

ఇంచార్జ్ కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీల రిజర్వేషన్ వివరాలు టి-పోల్ లో అప్ లోడ్ చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. మొదటి విడతగా గ్రామ పంచాయతీలలో ఎన్నికలు నామినేషన్ల స్వీకరణ అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని అన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు చేసేందుకు ఎఫ్.ఎస్.టి, ఎస్.ఎస్.టీ బృందాలను ఏర్పాటు చేశామని అన్నారు. ఎం.సి.ఎం.సి , మీడియా సెల్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ సమావేశంలో సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లు, డీఆర్డీఓ శేషాద్రి, డీపీఓ శర్ఫుద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఉన్న అంబేద్కర్ కూడలిలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ముందుగా, సామాజిక సమరసత వేదిక జిల్లా కన్వీనర్ మోర శ్రీనివాస్ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ భీమ్ రావ్ రాంజీ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల సమర్పించి, జిల్లా ప్రజలందరికీ రాజ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మోర శ్రీనివాస్ మాట్లాడుతూ, 1949 నవంబర్ 26న భారత రాజ్యాంగ సభ రాజ్యాంగాన్ని ఆమోదించినందున, ఈ రోజును రాజ్యాంగ దినోత్సవంగా జరుపుకోవడం చాలా సంతోషకరం అన్నారు. రాజ్యాంగ రూపశిల్పులను గౌరవించుకుంటూ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ దేశానికి చేసిన కృషికి నివాళులు అర్పించే రోజు ఇదేనని ఆయన పేర్కొన్నారు. నేడు ప్రపంచంలో అనేక దేశాలు పాలనాపరమైన సంక్షోభాలతో కొట్టుమిట్టాడుతున్నప్పటికీ, మన భారతదేశం కేవలం రాజ్యాంగం ప్రసాదించిన మౌలిక సూత్రాలు మరియు ప్రజాస్వామ్య విలువలతోనే పరిడవిల్లుతోందని, ఇది రాజ్యాంగం యొక్క గొప్పతనమని కొనియాడారు. ప్రజాస్వామ్య విలువలు, న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం మరియు సోదర భావం వంటి సూత్రాలు దేశ ఐక్యత, సమగ్రత, సమరసతకు ఎంతో మేలు చేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. కావున, ప్రతి ఒక్కరూ రాజ్యాంగం యొక్క మౌలిక సూత్రాలను పాటిస్తూ దేశ ఐక్యతకు పాటుపడాలని శ్రీనివాస్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వేదిక బాధ్యులు కోడం రవి, సుంకోజు రమేష్ చారి, గూడూరి భాస్కర్, చిమ్మని ప్రకాష్, గుడ్ల విష్ణు, గజ్జెల్లి సత్యనారాయణ, మాదాసు శ్రీనివాస్, సుంకోజ్ వినోద్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## 'దొంగ హామీలు-అమలుకాని వాగ్దానాలు' కరపత్రాల పంపిణీ

- బీజేపీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షులు దుమాల శ్రీకాంత్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

భారతీయ జనతా పార్టీ (బిజెపి) జాతీయ ప్రధాన కార్యదర్శి, కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి, పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ ఈ రోజు సిరిసిల్ల శాంతినగర్ ప్రాంతంలో ఇంటింటికీ కరపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమం ప్రధానంగా కాంగ్రెస్%–%బిఆర్ఎస్ ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన దొంగ హామీలు, అమల్లో పెట్టని సంక్షేమ వాగ్దానాలు, మరియు ప్రజలను తప్పుదారి పట్టించిన విధానాలపై అవగాహన కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నామని పార్టీ నాయకులు పేర్కొన్నారు.



ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు దుమాల శ్రీకాంత్ మాట్లాడుతూ.. ప్రతి బూత్ స్థాయిలో ఉన్న కార్యకర్తలు తప్పనిసరిగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందించి, ప్రజల నుండి సంతకాలు సేకరించాలని బండి సంజయ్ సూచించారని తెలిపారు. ప్రజల్లో రాజకీయ చైతన్యం పెంచడంలో ఈ కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తుంది. సిరిసిల్లలో ప్రతి కార్యకర్త చురుకుగా పాల్గొని ఈ ఉద్యమాన్ని విజయవంతం చేస్తున్నారని తెలియజేశారు.బుధవారం రోజు ఉదయం 8:00 గంటల నుండే బూత్ స్థాయిలో కార్యకర్తలు ఈ కార్యక్రమాన్ని ఉత్సాహంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కోడం రవి, శేఖర్, అభి రామారావు, విజయ్, ప్రవీణ్, మహిళా మోర్చా నాయకురాళ్లు కౌసల్య, లతా, రేఖ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# భారత్ ఘోర పరాజయం

- **దక్షిణాఫ్రికా చేతిలో 0-2 వైట్‌వాష్**
- **గౌహతిలో 408 పరుగుల తేడాతో ఘోర ఓటమి**

**బలగం టీవీ, హైదరాబాద్**



స్వదేశంలో టీమిండియా అరుదైన ఓటమిని చవిచూసింది. గౌహతిలో జరిగిన రెండో టెస్టులో దక్షిణాఫ్రికా 408 పరుగుల భారీ తేడాతో భారత్‌పై గెలుపొందింది. దీంతో రెండు మ్యాచ్‌ల సిరీస్ 2–0 తేడాతో ప్రొటీస్ జట్టు వైట్‌వాష్ చేసింది. ఈ పరాజయంతో ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్ల పట్టికలో భారత్ ఐదోస్థానానికి జారింది. పాకిస్తాన్ నాల్గో స్థానంలోకి పైకొచ్చింది.

**భారత్ లక్ష్యం 549... 140కే కుప్పకూలింది**

కోల్‌కతా టెస్టును 30 పరుగుల తేడాతో గెలిచిన దక్షిణాఫ్రికా, గౌహతిలో భారత్‌కు 549 పరుగుల లక్ష్యం నిర్దేశించింది. అయితే భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 140 పరుగులకే ఆలౌటైంది. బావుమా నేతృత్వంలోని ప్రొటీస్ జట్టు అద్భుత బౌలింగ్‌తో భారత్‌ను ఆలౌట్ చేసింది.

549 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో భాగంగా 27/2 ఓవర్‌నైట్ స్కోర్‌తో ఆఖరి రోజు ఆటను ప్రారంభించిన భారత్.. రెండో ఇన్నింగ్స్‌లో 140 పరుగులకే కుప్పకూలింది. భారత బ్యాటర్లలో రవీంద్ర జడేజా(87 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో 54) ఒక్కడే హాఫ్ సెంచరీతో రాణించగా.. మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు.

యశస్వి జైస్వాల్(13), కేఎల్ రాహుల్(6), సాయి సుదర్శన్(14), కుల్దీప్ యాదవ్(5), ధ్రువ్ జురెల్(2), రిషభ్ పంత్(13), వాషింగ్టన్ సుందర్(16), మహమ్మద్ సిరాజ్(0) తీవ్రంగా నిరాశపర్చారు. సౌతాఫ్రికా బౌలర్లలో సిమన్ హర్మర్(6/37) ఆరు వికెట్లతో భారత్ పతనాన్ని శాసించగా.. కేశవ్ మహరాజ్(2/37) రెండు వికెట్లు పడగొట్టాడు. మార్కో జాన్సెన్, సీనర్ ముత్తుసామి తలో వికెట్ తీసారు.

ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 489 పరుగుల భారీ స్కోర్ చేసింది. అనంతరం భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 201 పరుగులకే ఆలౌటైంది. యశస్వి జైస్వాల్(58), వాషింగ్టన్ సుందర్(48) మినహా మరే బ్యాటర్ రాణించలేదు. మార్కో జాన్సెన్ 6 వికెట్లతో భారత్ పతనాన్ని శాసించాడు. ఇప్పటికే ఈ సిరీస్‌లో సౌతాఫ్రికా 1–0తో ఆధిక్యంలో ఉంది. ఈ మ్యాచ్ డ్రా అయినా సిరీస్‌ను ఆ జట్టే కైవసం చేసుకుంటుంది.

ఈ ఓటమి భారత టెస్ట్ చరిత్రలో మరుపురాని నిరాశ.2004లో నాగ్‌పూర్‌లో ఆస్ట్రేలియా చేతిలో 342 పరుగుల తేడాతో ఎదుర్కొన్న ఓటమి కన్నా ఇది మరింత తీవ్రం.

గత ఏడాది అక్టోబర్–నవంబర్ 2024 మధ్య న్యూజిలాండ్ భారత్‌ను 3–0 తేడాతో వైట్‌వాష్ చేసింది. ఇప్పుడు దక్షిణాఫ్రికా కూడా రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్‌ను స్వీప్ చేసి టీమిండియాకు మరో పెద్ద దెబ్బ తగిలించింది.

**డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో భారత్ పతనం**

ప్రస్తుత చాంపియన్ దక్షిణాఫ్రికా నాలుగు టెస్టుల్లో మూడు గెలిచి 75 శాతం పాయింట్ల శాతంతో రెండోస్థానంలో నిలిచింది. భారత్ తొమ్మిది టెస్టుల్లో నాలుగు ఓడిపోయి, నాలుగింటిలో గెలిచి, ఒక మ్యాచ్ డ్రాగా ముగించడంతో 52 పాయింట్లు (48.15%) సాధించింది. ఈ ఫలితంతో ఐదోస్థానానికి పడిపోయింది. పాకిస్తాన్ 50 శాతం పాయింట్ల శాతంతో నాల్గో స్థానంలో ఉంది.

ఆస్ట్రేలియా ఇప్పటివరకు నాలుగు టెస్టులన్నింటినీ గెలిచి 100 శాతం పాయింట్లతో మొదటి స్థానంలో కొనసాగుతోంది. శ్రీలంక మూడోస్థానంలో ఉంది. డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో తొలి రెండుస్థానాల్లో నిలిచిన జట్లు ఫైనల్‌కు అర్హత పొందుతాయి.

# ఆసీస్‌ను ఓడించాలని ఉంది



- **2026 టీ20 వరల్డ్‌కప్ షెడ్యూల్ ప్రకటన కార్యక్రమంలో సూర్యకుమార్**

**బలగం టీవీ, హైదరాబాద్**

టీ20 ఫార్మాట్‌లో టీమిండియాను ముందుకు నడిపిస్తున్న కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ 2026 ప్రపంచకప్ ఫైనల్ గురించిన తన మనసులోని కోరికను బయటపెట్టాడు. "ఫైనల్లో ఓడించాల్సిన జట్టు ఏది?" అని ప్రశ్నించగాసూర్య ఒక్కసారిగా నవ్వుతూ "అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో ఆస్ట్రేలియాను ఓడించాలి%౯ా% ప్రతీకారం తీర్చుకోవాలి" అని స్పష్టం చేశాడు.

మంగళవారం అప్‌కమింగ్ 2026 టీ20 ప్రపంచకప్ షెడ్యూల్‌ను ఐసీసీ విడుదల చేసింది. ఈ కార్యక్రమానికి సూర్యతో పాటు మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ, భారత మహిళా జట్టు సారథి హర్మన్‌ప్రీత్ కౌర్ హాజరయ్యారు. ఈ వరల్డ్‌కప్‌కు రోహిత్ శర్మను ఐసీసీ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించింది.

2023 వన్డే ప్రపంచకప్ ఫైనల్‌లో భారత్ అహ్మదాబాద్ వేదికగా ఆస్ట్రేలియా చేతిలో ఓటుపాలు అయిన సంగతి తెలిసిందే. అజేయంగా సాగిన టీమిండియా, టైటిల్ మ్యాచ్‌లో మాత్రం ఆశ్చర్యకరంగా విఫలమైంది. ఈ చేదు జ్ఞాపకాన్ని గుర్తుచేసుకుంటూ సూర్యకుమార్"అదే స్టేడియంలో, అదే జట్టుపై గెలిచి మా బాధను తుడిచేసుకోవాలి" అని అన్నాడు.


ఈ ప్రపంచకప్‌లో భారత్ గ్రూప్–ఏలో పాకిస్థాన్, యూఎస్ఏ, నెదర్లాండ్స్, నమీబియాతో కలిసి ఉంది. ఫిబ్రవరి 7న అమెరికాతో ముంబై వేదికగా భారత్ తన ప్రచారాన్ని ప్రారంభించనుంది. టీ20 ఫార్మాట్‌లో ఏ జట్టు ఎప్పుడు ఎలా ఆడుతుందో చెప్పలేమని, ఇద్దరు బ్యాటర్లు–ఇద్దరు బౌలర్లు సత్తా చాటితే మ్యాచ్ పారుపడ్డట్లేనని సూర్య వ్యాఖ్యానించాడు.

పాక్‌తో మ్యాచ్ ఆడేందుకు టీమిండియా ఆటగాళ్లు ఎప్పుడూ ఉత్సాహంగా ఉంటారని, ఆసియా కప్‌లో ఆ జట్టుతో మంచి అనుభవం దక్కిందని సూర్య గుర్తుచేశాడు. "మా ఫోకస్ ఎప్పుడూ క్రికెట్‌పైనే దాని పక్కన ఇతర విషయాలు మా ఆలోచనల్లో ఉండవు" అని నవ్వుతూ చెప్పాడు. రోహిత్ శర్మ మాట్లాడుతూ "ఏ జట్టుతో ఫైనల్ అయినా పర్లేదు మనం ఫైనల్‌కు చేరి ట్రోఫీ గెలవాలి. గతంలో ఏం జరిగిందో జరిగిపోయింది. కానీ అదే వేదికపై ఆసీస్‌ను ఓడించాలని సూర్య ఎంతో బాధతో అన్నాడు" అని వ్యాఖ్యానించాడు.

## 'అఖండ 2'కు భారీ హైప్

**నవంబర్ 28న కూకట్‌పల్లిలో గ్రాండ్ ప్రీ-రిలీజ్ ఈవెంట్**

**బలగం టీవీ, హైదరాబాద్**




నందమూరి బాలకృష్ణ, దర్శకుడు బోయపాటి శ్రీను కాంబినేషన్ అంటే మాస్ ఆడియన్స్‌కు పండుగ. 'సింహా', 'లెజెండ్', 'అఖండ' వరుస బ్లాక్‌బస్టర్లతో దేశవ్యాప్తంగా అభిమానుల్లో అంచనాలను అమాంతం పెంచిన ఈ జోడీ, నాలుగోసారి కలసి చేస్తున్న చిత్రం 'అఖండ 2 %–% తాండవం'. టైటిల్ ప్రకటించిన దగ్గర నుంచే పాన్–ఇండియా స్థాయిలో భారీ క్రేజ్ ఏర్పడింది. విడుదల సమయం దగ్గరపడుతుండటంతో ప్రచారం కూడా ఉధృతంగా సాగుతోంది.

సినిమా మేకర్స్ అధికారికంగా ప్రీ–రిలీజ్ ఈవెంట్ వివరాలను ప్రకటించారు. నవంబర్ 28న హైదరాబాదు కూకట్‌పల్లి–ఖైతలాపూర్ గ్రౌండ్స్‌లో ఈ వేడుకను విశిష్టంగా నిర్వహించబోతున్నారు. సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే ఈ ఈవెంట్‌కు భారీగానే అభిమానులు హాజరయ్యే అవకాశం ఉంది. బాలయ్య–బోయపాటి కాంబినేషన్ కావడంతో ఈవెంట్‌లో పెద్ద సర్ప్రైజ్‌లు ఉండనున్నాయని టాలీవుడ్‌లో టాక్ నడుస్తోంది. కొత్త ట్రైలర్, స్పెషల్ యాక్షన్ ఫుటేజ్ లేదా ప్రత్యేక ప్రకటన ఏదో ఒకటి విడుదలయ్యే అవకాశముందని అభిమానులు చెబుతున్నారు. సినిమా డిసెంబర్ 5న పాన్–ఇండియా లెవెల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది.

## మహారాజుగా బాలయ్య..

'వీరసింహారెడ్డి' సంచలన విజయం తర్వాత బాలకృష్ణ, దర్శకుడు గోపీచంద్ మలినేని కాంబోలో మరో సినిమా తెరకెక్కనుంది. ఈ చిత్రాన్ని వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై నిర్మాత వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు.బాలకృష్ణ సరసన నయనతార కథానాయికగా నటిస్తున్నారు. 'సింహ, జై సింహా, శ్రీ రామరాజ్యం' తర్వాత బాలకృష్ణ, నయనతార కలిసి నటిస్తున్న 4వ చిత్రం ఇది. ఈ ప్రాజెక్టు బుధవారం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. ఆంధ్రప్రదేశ్ మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్ స్క్రిప్ట్‌ను నిర్మాతలకు అందజేశారు. బాలకృష్ణతో అనేక బ్లాక్‌బస్టర్‌లను అందించిన దర్శకుడు బి.గోపాల్ క్లాప్ కొట్టారు. బాలయ్య కుమార్తె తేజస్విని కెమెరా స్విచ్ ఆన్ చేశారు. మొదటి షాట్‌కు బోయపాటి శ్రీను, బాబీ, బుచ్చి బాబు సమిష్టిగా దర్శకత్వం వహించారు. గోపిచంద్ మలినేని తొలిసారిగా హిస్టారికల్ డ్రామాలోకి అడుగు పెడుతున్నారు. కమర్షియల్ బ్లాక్‌బస్టర్స్ రూపొందించే తన ప్రత్యేక మాస్ టచ్‌ను ఒక భారీ చారిత్రక కథలో మిళితం చేస్తూ, బాలకృష్ణను ఇప్పటివరకు చూడని ఓ కొత్త అవతార్ చూపించబోతున్నారు.



## '16 రోజుల పండగ' ప్రారంభం

**బలగం టీవీ, హైదరాబాద్**

సాయికిరణ్ అడివి దర్శకత్వంలో రూపొందనున్న నూతన చిత్రం '16 రోజుల పండగ'. సాయి కృష్ణ దమ్మాలపాటి హీరోగా పరిచయం అవుతున్నారు. గోపిక ఉదయన్ హీరోయిన్. ఈ చిత్రంలో రేణు దేశాయ్, అనసూయ భరద్వాజ్, వెన్నల కిషోర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రదా పిక్చర్స్, సాయి సినీ చిత్ర బ్యానర్ పై ప్రొడక్షన్ నెం–1గా సురేష్ కుమార్ దేవత, హరిత దుద్దుకూరు, ప్రతిభ అడివి నిర్మిస్తున్నారు.బుధవారం ఈ చిత్రం పూజాకార్యక్రమాలతో గ్రాండ్‌గా ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి కోన వెంకట్, కేకే రాధా మోహన్ నిర్మాతలకి స్క్రిప్ట్ అందించారు. డైరెక్టర్ శేఖర్ కమ్ముల క్లాప్ కొట్టారు. నిర్మాత టీజీ విశ్వప్రసాద్ కెమెరా స్విచాన్ చేశారు. ఫస్ట్ షాట్‌కు డి.సురేష్ బాబు గౌరవ దర్శకత్వం వహించారు. నిర్మాతలు అల్లు అరవింద్, మైత్రి రవి, దామోదర ప్రసాద్ ఈ కార్యక్ర్‌మానికి హాజరై, టీమ్‌కి అభినందనలు తెలిపారు.ప్రొడ్యూసర్ సురేష్ కుమార్ మాట్లాడుతూ, 'అద్భుతమైన కథ ఇది. డైరెక్టర్ చెప్పిన కథ చాలా నచ్చింది. 16 రోజుల పండగ .. వందరోజుల పండగ కావాలని కోరుకుంటు న్నాను' అని అన్నారు. "16 రోజుల పండగ' టైటిల్‌ని సజెస్ట్ చేసింది దర్శకుడు కృష్ణ వంశీ. ఆయనకి కథ విపరీతంగా నచ్చి, ఈ టైటిల్ పెట్టమని చెప్పారు. ఆయనకు కృతజ్ఞతలు' అని దర్శకుడు సాయి కిరణ్ అడివి చెప్పారు. రేణు దేశాయ్ మాట్లాడుతూ, 'సాయి కిరణ్ కోవిడ్ లాక్‌డౌన్‌కి ముందే ఈ కథ చెప్పారు. నాకు చాలా నచ్చింది. వెంటనే చేస్తానని చెప్పాను. ఇందులో అత్తమ్మ రోల్ చేస్తున్నాను. నా ఏజ్‌కి సరిపోతుందా అనిపించింది. కానీ ఆ పాత్ర, కథ అద్భుతమైనది. సినిమా చూస్తున్నప్పుడే ప్రేక్షకులకే అర్థమైపోతుంది. ఇది కచ్చితం మంచి ఆదరణ పొందుతుంది' అని తెలిపారు.

## విడుదల తేదీ నిర్ణయం నాదే

- **ప్రశాంత్ వర్మ స్పష్టం**

**బలగం టీవీ, హైదరాబాద్**



పాన్–ఇండియా స్థాయి సినిమాలు తెరకెక్కించే ప్రతిభ కలిగిన టాలీవుడ్ యువ దర్శకుల్లో ప్రశాంత్ వర్మ పేరు ముందుంటుంది. 'హనుమాన్'తో బాక్సాఫీస్‌ను షేక్ చేసి ఇండస్ట్రీ దృష్టిని తనవైపు తిప్పుకున్నాడు. సినిమాలు కొన్ని వివాదాల నడుమ సాగినా ప్రశాంత్ వర్మకి కాన్సెప్ట్, మేకింగ్, ప్రెజెంటేషన్‌పై మాత్రం అసాధారణమైన క్లారిటీ ఉందని పరిశ్రమ వర్గాలు చెబుతుంటాయి.

IFFI (గోవా) వేదికగా మాట్లాడిన ప్రశాంత్ వర్మ తాను నిర్మాతల నుంచి ఎక్కువ సమయం అడుగుతున్న విషయాన్ని ధృవీకరించాడు. "విడుదల తేదీలపై నియంత్రణ చాలా ముఖ్యం. నేను సినిమా ఒప్పందం చేసుకునే సమయంలో రిలీజ్ డేట్ విషయంలో తుది నిర్ణయం నాదేనని కాంట్రాక్ట్‌లో పొందుపరుస్తాను" అని ఆయన తెలిపారు. వీఎఫ్ఎక్స్‌పై తన అనుభవాలను వివరించిన ప్రశాంత్ "అవుట్‌పుట్ బాగా రావాలంటే ఆర్టిస్టులకు సమయం అవసరం. లేదంటే నిర్మాత వద్ద డబ్బు ఎక్కువైతే పెద్ద కంపెనీకి ఇచ్చి పనిని ముగించాలి. నేను నా మొదటి సినిమాతోనే ఇబ్బందులు ఎదుర్కొన్నాను. అందుకే ఇవాళ ప్రొడ్యూసర్లతో కలిసి డేట్‌ను నేనే ఫైనల్ చేస్తా" అని చెప్పారు. పోస్ట్ ప్రొడక్షన్ దశలో సమయాభావం ఉండకూడదని ఆయన స్పష్టం చేశారు. "షఉటింగ్ పూర్తయ్యాక అవుట్‌పుట్ సిద్ధం చేయడానికి సరైన టైం కావాలి. టైమ్ ఇస్తేనే నేను ప్రేక్షకులకు నచ్చే స్థాయి ప్రోడక్ట్ ఇస్తాను. ఈ విషయాన్ని నిర్మాతలు కూడా అర్థం చేసుకుంటారు" అని ప్రశాంత్ వర్మ చెప్పారు.

## బైకర్' రిలీజ్ వాయిదా

**బలగం టీవీ, హైదరాబాద్**




యంగ్ హీరో శర్వానంద్ ప్రధాన పాత్రలో, అభిలాష్ కంకర దర్శకత్వంలో రూపొందుతున్న స్పోర్ట్స్–యాక్షన్ ఎంటర్‌టైనర్ 'బైకర్' విడుదల వాయిదా పడింది. డిసెంబర్ 6న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని ముందుగా నిర్ణయించిన ఈ చిత్రాన్ని, మరింత మెరుగైన అనుభూతిని అందించేందుకు కొద్ది రోజులు ముందుకు జరిపినట్టు నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ బుధవారం ప్రకటించింది."ఇది సాధారణ సినిమా కాదు ప్రేక్షకులు మునుపెన్నడూ చూడని గొప్ప విజువల్ అనుభవం. చిత్రబృందం పగలు–రాత్రి తేడా లేకుండా కష్టపడుతోంది. థియేటర్లలో అడ్రినలిన్ రష్ కలిగించేలా సినిమా రూపొందుతోంది. అందుకే 3డీ, 4డీఎక్స్ వంటి అధునాతన ఫార్మాట్లలో 'బైకర్'ను విడుదల చేయాలని నిర్ణయించాం. త్వరలోనే కొత్త రిలీజ్ డేట్ ప్రకటిస్తాం" అని తెలిపింది.